క్లుప్తంగా

ఏసు లోక రక్షకుడు



వెల్దుర్తి: ఏసుక్రీస్తు లోక రక్షకుడు అని సకల మానవాళి పాప మోచనకై ప్రాణమివ్వటానికే తనను తాను తగ్గించుకొని లోకానికి వచ్చాడని రెవ.శ్యాంబాబు అన్నారు. గురువారం మండలంలోని పాపిరెడ్డికుంట తండా చర్చిలో ఏర్పాటు చేసిన ముందస్తు క్రిస్మస్ వేడుకలలో ఆయన పాల్గొని మాట్లాడారు. పల్నాడు దైవ సేవకుల సహవాసం ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలలో పాస్టర్ శ్యామ్యూల్ నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న పలువురు దైవ సేవకులు ప్రార్థనలు నిర్వహించి జ్ఞానుల వలె విలువైన హృదయం దేవునికి కానుకగా ఇవ్వాలని కోరారు. మహిళలు, పిల్లలు సంప్రదాయ గిరిజన నృత్యాలతో దేవుని స్తుతించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మోహన్‌బాబు, దైవ సేవకులు ప్రసాద్, శంకర్, సుందరరావు, జాషువ, సువర్ణసుందరి తదితరులున్నారు.

ఖోఖో రాష్ట్ర జట్టుకు ఒప్పిచర్ల విద్యార్థి



కారెంపూడి: రాష్ట్ర ఖోఖో జట్టుకు ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్ 7వ తరగతి విద్యార్థి వీరదాసు మనోహర్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం విజయలలిత గురువారం తెలిపారు. త్వరలో మహారాష్ట్రలో జరగనున్న రాష్ట్ర బాలుర అండర్-14 జట్టులో మనోహర్ ఆడనున్నాడని పేర్కొన్నారు. కారెంపూడి జెడ్పీ హైస్కూల్లో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించడంలో కీలకంగా వ్యవహరించి రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించాడని తెలిపారు. శిక్షణ ఇచ్చిన పీఈటీ చినరత్తయ్యను, విద్యార్థి మనోహర్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.


అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలి

డిప్యూటీ తహసీల్దార్ పి.బ్రహ్మయ్య



రెంటచింతల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని డిప్యూటీ తహసీల్దార్ పి.బ్రహ్మయ్య అన్నారు. గురువారం స్పెషల్ సమ్మరి రివిజన్(ఎస్ఎస్ఆర్)2025లో భాగంగా స్థానిక విజడమ్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఈ స్పెషల్ సమ్మరి రివిజన్ కార్యక్రమం తలపెట్టిందని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలని అన్నారు. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకునేవారు పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో దరఖాస్తు ఫారం-6ను బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను నేరుగా మీ గ్రామ వీఆర్వోలకు తహసీల్దార్ కార్యాలయంలో అందజేయవచ్చన్నారు. ఈ సమావేశంలో వీఆర్వో విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయినాథునికి పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్దనున్న షిరిడీ సాయి ఆలయంలో గురువారం ఆలయ అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో భక్తులు సాయిబాబాకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో సాయినాథునికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించారు. ఆలయ చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

బాలికల హక్కులు కాపాడుదాం

88త్యాళ్లూరు(క్రోసూరు): బాల్య వివాహాలను నివారించి, బాలికల హక్కులు కాపాడదామని పంచాయతీ కార్యదర్శి శిరీష అన్నారు. గురువారం గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 88 త్యాళ్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన అనే అంశంపై సమావేశం నిర్వహించారు. తండు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఏఎన్ఎం సరస్వతీ, ఆశ వర్కర్లు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సిబ్బంది లేరు.. నిధులు లేవు

తహసీల్దార్ల నియామకమెప్పుడో..?

- ఐదు మండలాలకూ ఇన్‌చార్జిలే
- అధికారులు లేక ప్రజల ఇక్కట్లు
- ప్రొటోకాల్ ఖర్చు పేరుతో తడిసి మోపెడవుతున్న భారం

సాధారణ ప్రజాపరిపాలన వ్యవహారాల్లో ముఖ్య భూమిక పోషిస్తున్న రెవెన్యూ శాఖపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు తహసీల్దార్లను నియమించకపోవటంతో ఇన్‌చార్జిలే పాలన సాగిస్తున్నారు. రెవెన్యూ యంత్రాంగంపై రాజకీయంగా, ప్రభుత్వ పరంగా ఒత్తిడులు పెరిగిపోతున్నాయి. సిబ్బంది లేక.. నిధులు లేక.. కనీస సౌకర్యాలు లేక రెవెన్యూ కార్యాలయాలు కునారిల్లుతున్నాయి.



మాచర్ల తహసీల్దార్ కార్యాలయం

మాచర్ల రూరల్: నియోజకవర్గంలోని మాచర్ల, వెల్దుర్తి, రెంటచింతల, కారంపూడి, దుర్గి మండలాలకు తహసీల్దార్లు లేక ఇన్‌చార్జిల పాలనలోనే పరిపాలన సాగిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలోని సిబ్బందిని డిప్యుటేషన్‌పై కలెక్టర్ కార్యాలయంలో వినియోగించుకోవటంతో కార్యాలయాల్లో పని భారంతో సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

- మాచర్ల మండలంలో పనిచేస్తున్న ఎండీ జియా ఉల్ హక్ సాధారణ బదిలీల్లో భాగంగా పొన్నూరుకు వెళ్లగా ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న బత్తుల వాణికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.
- రెంటచింతలకు కరుణకుమారి పనిచేస్తూ బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు. గురజాల తహసీల్దార్ నగేష్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.
- కారంపూడి మండలంలో ప్రసాదరావు రిటైర్డ్ కాగా నకరికల్లు తహసీల్దార్ పుల్లారావుకు బాధ్యతలు అప్పగించారు.
- దుర్గి మండలానికి ఎన్నికల సమయంలో నెల్లూరు నుంచి వచ్చిన రజనీకుమారి వేరే ప్రాంతానికి వెళ్లగా ఇక్కడకు వచ్చిన ప్రసాద్ డిప్యుటేషన్‌పై కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఫణికుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు.
- వెల్దుర్తి మండలానికి ఎన్నికల సమయంలో వచ్చిన ప్రసాదరావు నెల్లూరుకు బదిలీపై వెళ్లగా ఇక్కడ ఎవరినీ నియమించలేదు. డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న షేక్ బాషాకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

నిరంతరం ప్రజా సమస్యలతో ఎప్పుడూ బిజీగా ఉండే కార్యాలయాలు సరైన సిబ్బంది, ఫుల్ టైం తహసీల్దార్ల నియామకం జరగకపోవటంతో సకాలంలో పనులు కాక ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

అధికారుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు

రెవెన్యూ కార్యాలయ నిర్వహణ, జిల్లా యంత్రాంగాలు అప్పగించిన కార్యక్రమాలకు నిధులు అవసరమవుతాయి. సిబ్బంది లేరని సరిపెట్టుకున్నా నిధులు కూడా ప్రభుత్వం అందించటం లేదు. దీంతో కనీస ఖర్చులు కూడా ఎవరిని అడగాలో అర్థం కాక చేయి చాచాల్సిన దుస్థితి. తహసీల్దార్ కార్యాలయ ఖర్చు, స్టేషనరీ, అవసరమైన ప్రింటర్ల మెటీరియల్ కొనుగోలు చేయాలన్నా ఆర్థిక భారంతో బల్ల కింద చేతులు పెట్టే పరిస్థితి. రెవెన్యూ సంబంధిత కార్యక్రమాలతో పాటు సంబంధం లేని కార్యక్రమాలు కూడా రెవెన్యూ శాఖతోనే ప్రభుత్వం చేయిస్తుంది. గతంలో పెట్టిన ఖర్చులు ఇంత వరకు ఒక్క రూపాయి కూడా అందించలేదు. జిల్లా అధికారులు, ప్రభుత్వ పెద్దలు, రాజకీయ నాయకుల సమావేశాలకు ఉన్నతాధికారులు వస్తే వారి కార్యక్రమాలకు రెవెన్యూ యంత్రాంగానికి ప్రొటోకాల్ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఇవన్నీ ఎవరు ఖర్చు చేయాలో తెలియక రెవెన్యూ అధికారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ప్రొటోకాల్ ఖర్చుల కోసం కొందరు అప్పులు కూడా చేస్తున్నారు. పాసుపుస్తకం, ఇతర సేవలకు కింది స్థాయి ఉద్యోగులు మామూళ్లు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రమైన మాచర్లకు తహసీల్దార్‌ను నియమించి సకాలంలో సేవలందించేలా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో ఖాళీలను భర్తీ చేస్తాం



మాచర్ల నియోజకవర్గంలోని ఐదు మండలాలకు తహసీల్దార్ల కొరత ఉన్న మాట వాస్తవం. కొందరు సాధారణ బదిలీల్లో వెళ్లగా, ఇక్కడకు వచ్చే వారు లేకపోవటంతో ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్లకు, పక్క మండలాల తహసీల్దార్లకు అదనపు బాధ్యతలు అప్పగించాం. ప్రస్తుతం నూతన ఓటర్ల జాబితా రూపొందించేందుకు తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించటంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతన ఓటర్ల జాబితా పబ్లికేషన్ జరిగే వరకు బదిలీలు చేయటానికి అవకాశాల్లేవు. కొద్ది రోజుల్లో డిప్యూటీ తహసీల్దార్ల ప్రమోషన్ల లిస్టు వస్తుంది. పబ్లికేషన్ జాబితా అయిపోగానే ఖాళీలను పూర్తి చేస్తాం.

– వి.మురళీకృష్ణ, ఆర్డీఓ

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

గురజాల : స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులకు సంబంధించి ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో గౌసియా బేగం తెలిపారు. 16వ విడత సామాజిక తనిఖీ నిమిత్తం ది.01.04.2023వ తేదీ నుంచి 31.03.2024 వరకు పంచాయతీల్లో చేపట్టిన సామాజిక ఉపాధి హామీ పథకం పనులపై ఈ ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉమ్మడి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

కారెంపూడి: పల్నాటి ఉత్సవాల సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఎన్డీఏ కూటమి యూత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరుల గుడి ఆవరణలో డిసెంబర్ 3వ తేదీ పోటీలు జరుగుతాయని ఆసక్తి ఉన్న టీమ్‌లు పోటీలలో పాల్గొనవల్సిందిగా కోరారు. ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.15 వేలు, నాలుగవ బహుమతి రూ.10 వేలు ప్రకటించారు. నగదు బహుమతులతో పాటు షీల్డ్‌లను బహూకరించనున్నట్లు తెలిపారు. వివరాలకు 888699314, 9493139519, 9374061167 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ కేసులపై చార్జిషీట్ దాఖలు చేయాలి

క్రోసూరు: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ అరుణబాబు, ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యుడు గార్లపాటి దాసు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో అట్రాసిటీ పెండింగ్ కేసులపై వెంటనే కోర్టులో చార్జ్ షీట్ వేయాలన్నారు. పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామంలో ఎస్సీలపై పెట్టిన కేసును కొట్టేయాలన్నారు. అచ్చంపేట గురుకుల బాలుర వసతి గృహం సమస్యలు పరిష్కరించాలని కోరారు. సత్తెనపల్లి రామకృష్ణాపురం బాలికల గురుకుల వసతి గృహం నూతన భవనాలు నిర్మించాలన్నారు. క్రోసూరు కేజీబీవీలో గ్రౌండ్ లెవెల్ బాగు చేయించాలన్నారు. పలు సమస్యలను కలెక్టర్ పరిష్కరించాలని కోరారు.

పూలే ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలి

పిడుగురాళ్ల: జ్యోతిరావుపూలే ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని బీసీ కులాల ఐక్యవేదిక పల్నాడు ఏరియా కమిటీ నాయకులు దాదినబోయిన ఏడుకొండలు అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లా సెంటర్‌లో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే అని అన్నారు. స్త్రీలు విద్యావంతులు కావాలని బలంగా నమ్మి ఎంతో మంది స్త్రీలకు విద్యాదానం చేసిన వ్యక్తి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పులి వెంకటేశ్వర్లు యాదవ్, దూదేకుల సంఘం నాయకులు నబీబాషా, ఎస్‌కే బాషా, దూదేకుల బాషా, యాదవ సంఘ నాయకులు కొక్కెర పెదకొండలుయాదవ్, జిలానీ, సుధీర్, డి.రమేష్, పి.అంబేద్కర్ తదితరులు ఉన్నారు.



జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు



పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న కన్నెగంటి ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాస్

జ్యోతిరావ్‌పూలే అడుగుజాడలలో నడుద్దాం

రెంటచింతల: మహోన్నతమైన ఆశయాలతో సమసమాజ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహాత్మ జ్యోతిరావ్‌పూలే అడుగుజాడలలో నడుద్దామని కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాస్ అన్నారు. గురువారం జ్యోతిరావ్‌పూలే వర్ధంతి పురస్కరించుకుని స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆయన పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. తాను అనుభవించిన వివక్ష ఎవరూ అనుభవించకూడదని జీవితాన్ని త్యాగం చేసిన మహానీయుడు, ప్రస్తుత కాలంలో ఎందరికో మార్గదర్శకంగా నిలిచిన పూలే ఆశయాలు మహోన్నతమైనవని కొనియాడారు. సమ సమాజం కోసం తపిస్తూ మహిళలు కూడా విద్యావంతులు కావాలన్న లక్ష్యంతో భార్య సావిత్రి బాయి పూలేని ఉపాధ్యాయ శిక్షణకు పంపించి సామాజిక విప్లవకారుడిగా పేరుపొందారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ సందర్శన

మాచవరం: మండలంలోని కొత్తగణేశునిపాడు విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. క్లినిక్ సెంటర్‌లో రికార్డులను పరిశీలించారు. ఏఎన్ఎం, సిబ్బంది, ఆశా వర్కర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా క్లినిక్ సెంటర్‌లో గ్రామస్తులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలపై ఆరా తీశారు. వైద్య సేవలపై సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం మాచవరం పీహెచ్‌సీని సందర్శించి వైద్యాధికారులతో మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా స్టాటికల్ అధికారి నీలకంఠేశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి ఎస్‌కే ఉన్నూరు బాషా, ఆశా నోడల్ ఆఫీసర్ సురేష్, పీహెచ్‌సీ వైద్యాధికారులు సీహెచ్ ప్రసాద్, అన్వేష్, నసీరున్, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తగణేశునిపాడు విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ వద్ద జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం

రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలి

మాచవరం: పత్తి, వరి పంటలను అమ్ముకునేందుకు రైతులు ముందస్తుగా గ్రామ రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ కె.రామమ్మ తెలిపారు. మండలంలోని కొత్త గణేశునిపాడు, మల్లవోలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పత్తి, వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వరి 75 కేజీల బస్తా గ్రేడ్-ఏ రకం రూ.1,740, సాధారణ రకం రూ.1,720 మద్దతు ధర ప్రకటించిందన్నారు. తేమ శాతం అధికంగా లేకుండా చూసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సతీష్, రైతులు పాల్గొన్నారు.



వరి పంట దిగుబడిని పరిశీలిస్తున్న ఏఓ కె.రామమ్మ

గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు సేవల విస్తరణ

దాచేపల్లి : బ్యాంకు సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్నామని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన బ్రాంచ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేసానుపల్లిలో 272వ శాఖను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించేందుకు ఈ శాఖను ఏర్పాటు చేశామన్నారు. బ్యాంకింగ్ రంగంలో డిజిటల్ సేవలను విస్తృత పరుస్తున్నట్లు వెల్లడించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించేందుకు తమ శాఖ పని చేస్తుందన్నారు. బ్యాంకు సేవల పట్ల ఖాతాదారులు సంతృప్తికరంగా ఉన్నారన్నారు.

దాచేపల్లిలోని బ్యాంకును ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఎం పి.శ్రీనివాసరావు, బ్యాంకు మేనేజర్లు వి.వి.ప్రసాద్, బి.నిఖిల, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.



కేసానుపల్లిలో నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



రాజుపాలెం: యువత 18 ఏళ్లు నిండిన వెంటనే ఓటు హక్కు పొందాలని తహసీల్దారు దుర్గేష్‌రావు తెలిపారు. కొండమోడులో విద్యార్థి జూనియర్ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ ఓటు హక్కు అందరి బాధ్యతన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

సత్తెనపల్లి: కౌమార బాలబాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి అన్నారు. పట్టణంలోని వేద కళాశాలలో గురువారం కౌమార బాలబాలికల మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యుక్త వయసులో పౌష్టికాహార లోపం, రక్తహీనత తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలబాలికల అభ్యున్నతికి, బాలికల భద్రతకు వైద్య శాఖతో పాటు అన్ని శాఖలు కలిసి సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆహారం నుంచి ఆరోగ్యం వరకు అన్ని జాగ్రత్తలను పాటించాలని డాక్టర్ ఆసియా ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల, వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

బెల్లంకొండ: ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పలు ఆరోగ్య కార్యక్రమాలకు చర్యలు తీసుకుంటోందని మండల ఆయుర్వేద వైద్యులు ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో గురువారం 'దేశ్‌కా ప్రకృతి పరీక్షణ్' యాప్ పైన వివిధ గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 25 వరకు యాప్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ లోగా యాప్‌లో ప్రతి పౌరుని శారీరక, మానసిక, ఆరోగ్య సమాచారాన్ని సిబ్బంది వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఆరోగ్యాంశాలపై ప్రతి రోజు మెసేజ్ రూపంలో సూచనలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయుర్వేద శిబిరాన్ని నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీల, టీడీపీ నాయకులు వెన్న సీతారామిరెడ్డి, అంగన్వాడి, ఆయుర్వేద సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

డీఈఓ ఐ.చంద్రకళ పాఠశాలల ఆకస్మిక తనిఖీ

అమరావతి: పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఐ.చంద్రకళ పేర్కొన్నారు. గురువారం మండలంలోని లింగాపురం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గది వాతావరణం, బోధన విధానం పరిశీలించారు. విద్యార్థుల అభ్యాసన నైపుణ్యాన్ని పరీక్షించారు. 10వ తరగతి విద్యార్థుల నోట్ బుక్‌లను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన ప్రమాణాలను విశ్లేషించడానికి స్లిప్ పరీక్షలు, 3, 4 తరగతుల విద్యార్థులకు పఠన పరీక్ష నిర్వహించాలని సూచించారు. అనంతరం సమావేశం నిర్వహించి సిబ్బంది, ఉపాధ్యాయులు సక్రమంగా పాఠశాలకు హాజరుకావాలని స్పష్టం చేశారు. నెమ్మదిగా నేర్చుకునే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి తరగతికి సబ్జెక్ట్ వారీగా వారి ట్రాక్ రికార్డ్‌ను నిర్వహించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రత సక్రమంగా నిర్వహించాలని ఆయాలకు సూచించారు. ఈ కార్యక్మరంలో ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, శివబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల వర్క్ బుక్‌లు పరిశీలిస్తున్న డీఈఓ చంద్రకళ

కమ్యూటేషన్ రికవరీ నిలిపివేతపై హర్షం

అమరావతి: ప్రభుత్వ పెన్షనర్లకు 135 నెలలు, అంతకు మించి కమ్యూటేషన్ రికవరీ చేసిన వారికి ఈ నెలలో కమ్యుటేషన్ రికవరీ నిలిపివేసినట్లు అమరావతి–పెదకూరపాడు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు జి. కోటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు లేఖ రాడంతో.. కమ్యూటేషన్ రికవరీ నిలిపివేయడం శుభపరిణామమన్నారు. రాష్ట్ర బాధ్యుడు కొసరాజు రంగారావు మాట్లాడుతూ 180 నుంచి 135 నెలలకే పరిమితం చేసి కమ్యూటేషన్ తగ్గించినందుకు హర్షం వ్యక్తం చేశారు. డిసెంబరు 17న పెన్షనర్స్ డే ఘనంగా జరపాలని సమావేశం తీర్మానించిందన్నారు. సంఘ సభ్యులు సుబ్బారావు, తిమ్మయ్య, హనుమంతరావు, నాగేశ్వరరావు, బాస్కరరెడ్డి, చిన్నపరెడ్డి మస్తాన్‌రావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు

రాగి తీగ చోరీ

బెల్లంకొండ: చంద్రాజుపాలెం గ్రామంలో నిమ్మతోటలోని బోర్ విద్యుత్ మోటార్ వైర్‌ను కత్తిరించి, అందులోని రాగి తీగను దొంగలు ఎత్తుకెళ్లారు. గురువారం రైతు బూతుకూరి అప్పిరెడ్డి వివరాలు వెల్లడించారు. బోర్‌లోని మోటార్‌ను బయటకు లాగి, విద్యుత్ తీగను కత్తిరించినట్లు తెలిపారు. నిమ్మ తోటకు నీటి తడులు ఇస్తున్న తరుణంలో తీగను చోరీ చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు.



చోరీకి గురైన మోటార్‌ను చూపుతున్న రైతు

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రారంభమైంది..



అచ్చంపేట: ఇకపై విద్యుత్ వినియోగదారులు విద్యుత్ చార్జీలను రీచార్జ్ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని, ఇప్పుడున్న పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు బిగించనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శివకోటిరెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయానికి స్మార్ట్ మీటర్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముందుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కమర్షియల్ సంస్థలకు, గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తామన్నారు. మండలంలో సుమారు 500 ప్రభుత్వ సంస్థలు ఉన్నట్లు చెప్పారు. అచ్చంపేటలోనే 80కి పైగా ఉన్నాయన్నారు. రోజుకు సుమారు 20 చొప్పున స్మార్ట్ మీటర్లు బిగిస్తామన్నారు. ఈ ప్రక్రియ నాలుగు నెలలపాటు కొనసాగుతుందన్నారు.